



కరప ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్



కొల్లగొట్టింది.. కోట్లలోనే..

- జిల్లాలో సైబర్ టెర్రర్: అంతకంతకూ పెరిగిపోతున్న నేరాలు
- గతేడాది జిల్లాలో రూ.26.57కోట్లు కొల్లగొట్టేసిన నేరగాళ్లు
- మోసపోయిన బాధితులు 2,672మంది: కేవలం 55 నేరాలపైనే ఎఫ్ఐఆర్‌లు నమోదు
- ఏడాది వ్యవధిలో మూడురెట్లకుపైగా పెరిగిన మోసాలు
- 2023లో జిల్లాలో సైబర్ నేరాల్లో జనం పాగొట్టుకున్న సొమ్ము రూ.8.32కోట్లు
- అమాయకుల నుంచి చదువుకున్న వారి వరకు టార్గెట్
- సైబర్ నేరాలపై అవగాహన పూర్తిగా లేక మోసపోతున్న జనం
- ఖాతాలో డబ్బులు పోయిన కొన్ని గంటల్లో ఫిర్యాదు చేస్తేనే ఫలితం

జిల్లాలో సైబర్ నేరాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. అడ్డుఅదుపు లేకుండా నేరగాళ్లు అమాయకులపై వలవేసి నిలువునా దోచుకుపోతున్నారు. అవగాహన లేక జనం సైతం నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని మోసపోతున్నారు. దీంతో ఏటా ఈ కేసులు అమాంతం పెరిగిపోతున్నాయి. గతేడాది జిల్లావ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు అమయాక జనం నుంచి కొల్లగొట్టింది లక్షా, రెండు లక్షలు కాదు.. ఏకంగా రూ.26.57కోట్లు. ఒకరకంగా ఆశ్చర్యపోయేలా ఈస్థాయిలో నేరాలు పెరిగిపోతుండడం పోలీసులను సైతం కలవరపెడుతోంది.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

2023తో పోల్చితే ఏడాది తిరిగే సరికి జిల్లాలో సైబర్ మోసాల కేసులు, బాధితులు సైతం వందల నుంచి వేలల్లోకి పెరగడం ఆందోళనకర అంశం. అంతేకాదు.. జనం సైతం పోగొట్టుకున్న సొమ్ము కూడా ఏకంగా మూడు రెట్లు పెరిగిపోవడం ఏ స్థాయిలో సైబర్ నేరగాళ్లు జిల్లాపై పంజా విసురుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా సైబర్ నేరాల కింద ఫోన్‌కు వచ్చిన అనుమానిత లింక్ ఓపెన్ చేస్తేనో, ఓటీపీ చెబితేనో నేరగాళ్లు వేలల్లో కొల్లగొట్టేసేవారు. కానీ ఇప్పుడు ఏకంగా రూటు మార్చి వీడియో కాల్స్ చేస్తూ అరెస్టుల పేరుతో బెదిరించి కోట్లకు కోట్లు కొట్టేస్తుండడం పెరిగిపోయిన నేరాల తీవ్రతను చాటుతోంది. ఇటీవల పెద్దాపురంలో ఓ బడా రైతు సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్ట్ పేరుతో ఏకంగా రూ.కోటి కొట్టేయడం ఇందుకు నిలువెత్తు నిదర్శనం.

సైబర్ అరాచకం..

ఉన్నట్టుండి మన ఫోన్‌కు ఓ కాల్ వస్తుంది.. మీ ఆధార్ నెంబర్ ఫలానా నేరం జరిగిన చోట దొరికింది. మీ పేరు.. ఊరు.. ఫలానా అంటూ ఎదుటి వ్యక్తి బెదిరిస్తాడు. అర్జంట్‌గా వాట్సాప్ వీడియో కాల్‌లోకి రమ్మని హెచ్చరిస్తారు.. తీరా వెనుక పోలీస్‌స్టేషన్ సెటప్. ఖాకీ దుస్తుల్లో నేరగాడు. అర్జంట్‌గా మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేస్తున్నాం అంటూ బెదిరిస్తారు. ఈలోపు ఎదుటి వ్యక్తి భయాన్ని గమనించి అరెస్ట్ లేకుండా ఉండాలంటే లక్షల్లో ఇవ్వాలని హెచ్చరిస్తారు. అదంతా మోసం అని గమనించలేక భయంతో అనేక మంది నేరగాళ్లు చెప్పిన ఖాతాకు డబ్బులు బదిలీ చేస్తూ మోసపోతున్నారు. ఇలా వందలాదిమంది జిల్లాలో గడచిన ఏడాది కాలంలో కోట్లకు కోట్లు పాగొట్టుకున్నారు. అర్జంట్‌గా డబ్బులు కావాలి అంటూ కలెక్టర్ లేదా ఇతర ప్రముఖుల పేర్లతో ఫోన్‌లు చేయడం, వాట్సాప్ మెసేజ్‌లు పంపి డబ్బులు వసూలు చేసిన ఘటనలు సైతం జిల్లాలో తరచూ జరుగుతున్నాయి. నిందితులు జిల్లాలో ఇద్దరు గత కలెక్టర్ల పేర్లను, ఫొటోలను సైతం వాడేశారు. కొందరు నేరగాళ్ల ఉచ్చును గమనించక ఫోన్‌పేలు, గూగుల్ పేలో డబ్బులు పంపిస్తూ మోసానికి గురవుతున్నారు. ఇలా ఇప్పటివరకు గతేడాది జిల్లాలో వేలాది మంది మోసపోయారు. కొందరైతే బయటకు చెబితే పరువు పోతుందనే భయంతో బయటపడడం లేదు. మరికొందరైతే ఆలస్యంగా తేరుకుని పోలీసులకు ఫోన్‌లు చేస్తున్నా నిందితులను పట్టుకోవడం అసాధ్యంగా మారుతోంది. మోసపోయిన కొద్ది సమయంలోనే పోలీసులను ఆశ్రయిస్తే ఎంతో కొంత ఫలితం ఉండే అవకాశం ఉన్నా జనం మాత్రం ఈ విషయంలో అవగాహన లేక నష్టపోతున్నారు.

పెద్దాపురం ఘటనలో..

ఇటీవల పెద్దాపురంలో ఓ రైతును సైబర్ నేరగాళ్లు భయపెట్టి రూ.కోటి వరకు కాజేశారు. పోలీసులను ఆశ్రయించడంతో వాట్సాప్ కాల్స్ చాట్ ద్వారా నిందితులను ఢిల్లీ వెళ్లి పట్టుకున్నారు. కానీ డబ్బుల రికవరీ జరగలేదు. వాస్తవానికి ఫోన్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేయడం, ఓటీపీ చెప్పడం ద్వారా డబ్బులు పోగొట్టుకున్న కొన్ని కేసుల్లో మాత్రం నగదు రికవరీ జరుగుతోంది. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న తర్వాత పోయిన డబ్బు రావడం అసాధ్యంగా మారుతోంది. పోలీసులు సైతం సాంకేతికంగా వేగంగా కదిలే పరిస్థితి లేకపోవడం, నిందితులు సైతం ఎక్కడెక్కడి నుంచో మోసాలకు పాల్పడుతుండడం కేసులను చేధించడానికి వీలు కుదరడంలేదు. దీంతో బాధితుల సంఖ్య పెరుగుతున్నా రికవరీ కష్టంగా మారుతోంది. జిల్లాలో గతేడాది వేలాదిమంది ఇలా సైబర్ నేరగాళ్లలో వలలో చిక్కుకుని మోసపోయారు. కానీ పోయిన డబ్బు రాదనే నైరాశ్యంతో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా ముందుకు రావడం లేదు. కొందరు ఫిర్యాదు చేస్తున్నా ఆధారాలు లేకపోవడంతో పోలీసులు ఎఫ్ఐఆర్‌లు కట్టలేని పరిస్థితి.

ఏడాదిలో మూడు రెట్లు దోచేశారు..

జిల్లాలో 2024లో మొత్తం 2,672మంది తాము సైబర్ నేరానికి గురైనట్లు పోలీసులను ఆశ్రయించారు. అందే 2023లో అయితే 1,854 మంది బాధితులు పోలీసుల వద్దకు వచ్చారు. కానీ వీరిలో 80శాతం మంది డబ్బులు పోగొట్టుకున్నామని ఫిర్యాదు ఇచ్చినప్పటికీ మోసం చేసిన వ్యక్తికి సంబంధించి కనీస ఆధారాలు ఇవ్వలేకపోయారు. అటు సమయానికి రాకుండా చాలా కాలం తర్వాత మోసానికి గురయ్యామంటూ వచ్చిన వారే అధికం. దీంతో పోలీసులు వీటిపై కేసులు నమోదు చేయలేదు. పోలీసులను ఆశ్రయించిన వేలాది మందిలో గతేడాది 55 నేరాలకు సంబంధించి మాత్రమే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి గతేడాది జిల్లాలో సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన మొత్తం రూ.26.57కోట్లు. ఇందులో పోలీసులు 5శాతం కూడా రికవరీ చేయలేని పరిస్థితి. ఇదే 2023లో అయితే 39 కేసులు నమోదు చేయగా, ఇందులో జనం పోగొట్టుకున్న సొమ్ము రూ.8.32కోట్లు. అంటే అంతకుముందు ఏడాదితో పోల్చితే ఒక్క ఏడాదిలో సైబర్ నేరగాళ్లు జిల్లాలో మూడురెట్లు అధికమొత్తంలో డబ్బులు కొల్లగొట్టేశారు. కాగా ఇటీవల కాలంలో సైబర్ నేరాల తీవ్రత పెరగడం, కేసులు కూడా అధికంగా వస్తుండడంతో కూటమి ప్రభుత్వం జిల్లాకో సైబర్ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తోంది. దీంతో బాధితులకు కొంత వరకు న్యాయం జరిగే అవకాశం ఏర్పడనుంది.

- కలెక్టర్ షాన్ మోహన్.. కరపలో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'

పరిశుభ్రమైన వాతావరణంతోనే.. ప్రజారోగ్యం సాధ్యం

కరప, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన వాతావరణంతోనే ప్రజారోగ్యం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కరపలో మార్కెట్‌సెంటర్ నుంచి మెరకవీధి మీదుగా నిర్వహించిన స్వచ్ఛతా ర్యాలీలో డీపీవో రవికుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా 3వ శనివారం జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా భావించి విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ పి.శ్రీలక్ష్మి, సర్పంచ్ ఆశాజ్యోతి, ఎంపీడీవో అనుపమ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి నిర్మలాదేవి పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ సక్రమంగా నిర్వహించాలి: జేసీ



కలెక్టరేట్‌లో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), జనవరి18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో సక్రమంగా నిర్వహించి స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని జేసీ రాహుల్‌మీనా అన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయం పరిసరాలను శుభ్రపరిచారు. చుట్టూ ఉన్న పౌరసరఫరాల కార్యాలయం, వివేకానందహాలు తదితర కార్యాలయాల ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర చెత్తను సేకరించి ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ న్యూ ఇయర్-క్లీన్ స్టార్ట్ అనే ప్రత్యేక అంశంతో ఈ నెల స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశుభ్రం చేసి ప్రతిజ్ఞ చేయించారు. సీపీవో త్రినాథ్, సమాచార పౌరసంబంధాల శాఖ డీడీ నాగార్జున. పౌరసరఫరాల సంస్థ డీఎం దేవులా నాయక్, వికాస పీడీ లచ్చారావు, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘననివాళి



ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కాకినాడ జడ్పీ సెంటర్‌వద్ద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిటీ ఎమ్మెల్యే వనమాడి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ తదితరులు

రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాలు ఈనెల 20 నుంచి 31 వరకు నిర్వహించబోతోందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ప్రత్యేక నిధులు కేటాయించి పశువుల ఆరోగ్యానికి చికిత్స, ఉత్పాదకత పెంచేందుకు చికిత్స వ్యాధులను నియంత్రించేందుకు టీకాలు, పశుపోషణ ఖర్చులు తగ్గించేందుకు చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా పశువులను పరీక్షించి ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. తేలికపాటి శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు. ఎదకు రాని, చూలు కట్టని, గర్భకోశ వ్యాధులకు పశువైద్యులతో పరీక్ష చేసి తగు వైద్యం అందిస్తారన్నారు. ఎదకు వచ్చిన పశువులను గుర్తించి రైతన్న ఇష్టం మేరకు లింగ నిర్ధారిత వీర్యం కృత్రిమ గర్భధారణ చేయిస్తామన్నారు. చూడి పరీక్షలు చేసి తగు సూచనలు చేయిస్తామన్నారు. పశుఆరోగ్య శిబిరాలు ముగిసిన అనంతరం పశుపోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై, పశువిజ్ఞానంపై అవగాహన సదస్సులు పశువైద్యులతో నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సుల్లో పశు సంవర్ధకశాఖ ద్వారా ప్రవేశపెడుతున్న వివిధ పథకాల గురించి వివరించబడతాయన్నారు. పశు పోషకులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

రేపు యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు యథావిధిగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరు కావాలన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు 7

నేటి నుంచి రాష్ట్రస్థాయి కర్ణాటక సంగీత గాత్ర, వీణా వాయిద్య పోటీలు 7



పిఠాపురంలో ట్రాక్టర్ ద్వారా తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఎండుగడ్డి

ఎండుగడ్డి.. బంగారమాయనే

- పశుగ్రాసానికి ఎనలేని డిమాండ్
- ఎకరం గడ్డి రూ.5వేల నుంచి రూ.6వేలు
- అంత ధర పెట్టినా దొరకని పరిస్థితి
- వరికోత యంత్రాల వినియోగం, అకాల వర్షాలతో గడ్డి కొరత
- రైతులకు తప్పని ఇక్కట్లు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు రైతులను అడిగితే కాదనకుండా ఎండుగడ్డిని ఉచితంగా ఇచ్చేవారు. పశువుల మేతగా తీసుకువెళ్లమనేవారు. తర్వాత నామమాత్రపు ధర తీసుకునేవారు. ఇదంతా గతం. ఇప్పుడు ఆ ఎండుగడ్డే బంగారమైంది. డిమాండ్ పెరిగి అధిక ధర పెట్టినా దొరకని పరిస్థితి. ఒకప్పుడు రోజుల తరబడి పొలాల్లో ఉండిపోయే ఎండుగడ్డిని రైతులు అడిగినంత ధర ఇచ్చి క్షణాల్లో తీసుకువెళ్లిపోతున్నారు. సార్వా మాసూళ్లు దాదాపుగా పూర్తయినా ఎండుగడ్డి కోసం పశుసంపద ఉన్న రైతుల చేస్తున్న ప్రయత్నాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

వరిసాగు చేసే పొలాల్లో ఉండే గడ్డిని ఎలా తరలించాలన్న పరిస్థితి నుంచి తమకే ఇవ్వండి అంటూ కోతల ప్రారంభానికి ముందే పూర్తి సొమ్ములు ఇచ్చే స్థితికి మారింది. ఎండుగడ్డే వరిసాగువల్ల వచ్చే లాభాల కంటే అధికంగా అందిస్తోంది. వరికోత యంత్రాల ద్వారా వరికోతలు, మాసూళ్లు సాగడం, అకాల వర్షాలు, వరదల ప్రభావంతో ఎండుగడ్డి లభ్యత అంతంతమాత్రంగానే ఉంటోంది. పశువులున్నవారు సైతం కూలీలు దొరకక యంత్రాల వైపు దృష్టిసారిస్తుండడంతో పశుగ్రాసానికి ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో 2లక్షల ఎకరాల్లో వరి సాగవ్వగా అందులో 80శాతానికి పైగా వరికోతయంత్రాల ద్వారానే మాసూళ్లు నిర్వహించారు.

ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బంది

కాకినాడ జిల్లాలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలతోపాటు అన్ని మండలాల రైతులను అకాల వర్షాలు వెన్నాడుతుండడంతో నాణ్యమైన గడ్డి లభించడం లేదు. సార్వా సాగు తర్వాత కోతలు, మాసూళ్ల సమయంలో ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. దీంతో గడ్డి నాణ్యత దెబ్బతింది. తడిచిన, నేలనంటిన పంటకు మట్టి అంటుకుపోవడంతోపాటు రంగు మారడంతో అది వినియోగించడానికి వీలులేకుండా పోయింది. సాధారణ పద్ధతుల్లో వరి పంటను కోస్తే పశువులకు గడ్డి అయినా లభిస్తుందనే భావనతో భారమైనా రైతులు ఇటువైపు మొగ్గుచూపినా పరిస్థితులు అనుకూలించలేదు. ఏలేరు, సుద్దగడ్డ, పంపా, తాండవ వరదలతో 50వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లింది. దీని ప్రభావం ఎండు గడ్డి లభ్యతపై పడింది.

వరికోత యంత్రాలదే హవా

కూలీలకు ఇచ్చే మొత్తాలు పెరిగిపోవడం, కోత సమయంలో వాతావరణ మార్పులతో రైతులు వరికోత యంత్రాలపై మొగ్గు చూపారు. దీనివల్ల గంట వ్యవధిలోనే ఎకరం పొలంలో వరి పంట కోత, మాసూళ్లు పూర్తయి ధాన్యం చేతి కందుతుండడంతో సమయం ఆదా అవుతుందని ఎక్కువమంది యంత్రాలపై ఆసక్తి చూపుతున్నారు. ఈ సార్వా సీజన్‌లో 80శాతం విస్తీర్ణంలో వరిపంట కోతయంత్రాల ద్వారా కోతలు, మాసూళ్లు నిర్వహించారు. వరిపంటను నేరుగా మిషన్ల ద్వారా కోతలు, మాసూళ్లు ఒకేసారి నిర్వహిస్తే దాని ద్వారా వచ్చే గడ్డి పశుగ్రాసానికి పనికిరాదు. దీంతో యంత్రాలతో మాసూళ్లు నిర్వహించిన గడ్డి పొలాల్లోనే ఉండిపోతోంది.

నాడు ఉచితం.. నేడు డిమాండ్

ఒకప్పుడు ఉచితంగా ఇచ్చే ఎండుగడ్డికి ఎనలేని డిమాండ్ ఏర్పడింది. ఎకరంలోని వరిపంట ద్వారా వచ్చే ఎండుగడ్డికి ఐదేళ్ల క్రితం వరకూ రూ.1,000-1,500 చెల్లించేవారు. గతేడాది రూ.3వేలనుంచి రూ.4వేల వరకూ ఉండగా ఇప్పుడు రూ.5వేల నుంచి రూ.6వేల వరకూ చేరింది. ఇంత ధర పెట్టినా ప్రస్తుతం ఎండుగడ్డి లభ్యం కావడం లేదు. కొందరు రైతులు పొలాల్లో సార్వా పంటను మెరక ప్రాంతాల్లో వరికుప్పలుగా వేసి ఉంచి సార్వా, దాళ్వా పంటను కలిపి నూర్పవచ్చునని భావిస్తున్నారు. ఇప్పుడు వీరి వద్దకు పశుపెంపకందారులు, రైతులు వచ్చి గడ్డికి తమకే ఇవ్వాలని కోరుతున్నారు.

భారమైనా తప్పట్లేదు..

వరిపంటను మనుషులతో కోసి, ఆరబెట్టి, కుప్పలు వేసి సాధారణ పద్ధతుల్లో నూర్పిళ్లు నిర్వహించడానికి అధిక మొత్తంలో వ్యయం చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. అదే మిషన్ ద్వారా కోత, మాసూళ్ల నిర్వహణకు ఎకరానికి రూ.2,000-2,500 వరకూ అవుతుండగా వరికోత, కుప్పలు వేయడానికి, మాసూళ్లకు సాధారణ పద్ధతుల్లో చేయడానికి రూ.6-7వేల మధ్యన వ్యయం అవుతోంది. ఈ అదనపు వ్యయాన్ని ఎండుగడ్డి విక్రయం ద్వారా రాబట్టుకుంటున్నామని కొందరు రైతులు తెలిపారు. ఇప్పటికే పెరిగిన దాణా ధరలతో ఇబ్బంది పడుతున్న పశువుల పెంపకందార్లకు ఎండు గడ్డి ధరలు షాక్ ఇస్తున్నాయి. సొంతంగా పశువులు ఉన్న రైతులు సాధారణ పద్ధతుల్లో కోతలు, మాసూళ్లు చేసి గడ్డిని నిల్వ ఉంచుకుంటున్నారు. లేకుంటే గడ్డి కొనే పరిస్థితి లేదని వారంటున్నారు.

చేనేతకు ఊతం



- త్రిఫ్ట్ పథకం పునరుద్ధరణ
- నేతన్న పొదుపునకు ప్రోత్సాహం
- రూ.21.78లక్షలు నిధుల విడుదల
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

పెద్దాపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఊతమిచ్చే త్రిఫ్ట్ పథకాన్ని పునరుద్ధరించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేతన్నలు తమకు వచ్చే ఆదాయంలో 8 శాతాన్ని డిపాజిట్ చేస్తే దానికి 16శాతం రాష్ట్ర ప్రభుత్వం కలుపుతుంది. 90 రోజుల్లో ఆ మొత్తం చేనేత కార్మికుడికి అందుతుంది. నేతన్నల పొదుపును ప్రోత్సహించే ఈ పథకాన్ని గత ప్రభుత్వం విస్మరించగా కూటమి ప్రభుత్వం నేతన్నల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలను చేపట్టింది.

గత ప్రభుత్వంలో నిలిపివేత

త్రిఫ్ట్ పథకం 2014 నుంచి 2019 వరకూ అమలైంది. అప్పట్లో ప్రతి సహకార సంఘంలో ఈ పథకంలో 150మంది వరకూ నమోదై ఆర్థికంగా లబ్ధి పొందారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని నిలిపివేసింది. సొసైటీలకు ఎన్నికలు పూర్తయ్యాక లబ్ధిదారుల ఎంపిక సైతం ప్రారంభం కానుంది. కాకినాడ జిల్లాలో 2775మంది చేనేత కార్మికులు ఉన్నారు. గడచిన ఐదు సంవత్సరాల్లో పరిణామాలు కూడా చేనేత వృత్తిదారులు తగ్గడానికి ఓ కారణంగా కనిపిస్తోంది. ప్రధానంగా పట్టు, నూలు, వంటి ముడి సరుకులపై కేంద్ర ప్రభుత్వం రాయితీ ఎత్తేసింది. నూలు, రంగులు, రసాయనాలపై కేంద్రం 18శాతం జీఎస్టీని విధించింది. వైసీపీ హయాంలో చేనేత హస్తం పథకం తప్పించి సొసైటీలకు సాయం చేయలేదు. ఆప్కో బకాయిలు కూడా చెల్లించలేదు. గతంలో ప్రభుత్వాలు రాయితీ పై బ్యాంకు రుణాలు, మగ్గాలు ఇతర పరికరాలు అందించేవి. చేనేత కార్పొరేషన్ ద్వారా విరివిగా రుణాలు ఇచ్చేవి. కూటమి ప్రభుత్వం కూడా సొసైటీలకు జవసత్వాలు నింపాలని భావిస్తోంది. గతంలో మాదిరిగా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. తద్వారా సొసైటీల్లో సభ్యులు క్రియాశీలకమవుతారని అంచనా వేస్తోంది.

పెద్దాపురం క్లస్టర్ మంజూరు..

పెద్దాపురం క్లస్టర్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. 92మంది సభ్యులతో ఇది ఏర్పాటు కానుంది. కార్మికులకు సంబంధించి పరికరాలను త్వరలోనే అందించనుంది. ఇందుకోసం రూ.54.80లక్షలు మంజూరయ్యాయి. మోటరైజ్డ్ ట్రిప్పింగ్ డివైజెస్, సోలార్ లైటింగ్ యూనిట్లు, జగార్డింగ్ యంత్రాలు, డాబీస్, ఫ్రేమ్ లూమ్స్, తదితర పరికరాలు అందించనున్నారు.

సొసైటీలకు ఎన్నికల తర్వాత ఎంపిక

చేనేత అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. త్రిఫ్ట్ పథకాన్ని పునఃప్రారంభిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సొసైటీలకు ఎన్నికలు పూర్తిచేసి త్రిఫ్ట్ పథకాన్ని లబ్ధిదారులకు ఎంపిక చేస్తారు. 28 సంఘాలకు రూ.21.78లక్షలు త్రిఫ్ట్ పథకం నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఇటీవల పెద్దాపురంలో చేనేత కార్మికులకు ముద్రా రుణాలు సైతం అందించారు. 20 మందికి రూ.50వేలు వంతున అందించాం.

-కె.పెద్దిరాజు, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా చేనేత, జౌళిశాఖ, కాకినాడ

ఆర్థిక ప్యాకేజీతో స్టీల్ ప్లాంట్‌కు పూర్వవైభవం

- కాకినాడ ఎంపీ తంగెళ్ల

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 18(ఆంధ్రజ్యోతి): నష్టాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని, ప్యాకేజీతో స్టీల్ ప్లాంట్ పూర్వవైభవం సాధిస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్లఉదయ్‌శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఆశాదీపంలా కేంద్రం రూ.11,440కోట్లు భారీ ప్యాకేజీ ప్రకటించిందన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కార్మికుల భవిష్యత్తుకోసం గతంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అనేక రూపాల్లో చేసిన పోరాటాలు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తోపాటు కూటమి నాయకుల ప్రత్యేక కృషితో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

భలే..భలే బోన్సాయ్

సుమనోహరం..చిట్టి చెట్ల వనం

కాకినాడ జన్మభూమి పార్కులో బోన్సాయ్ గార్డెన్
చిట్టి కుండీల్లోనే వృక్షాల పెంపకం

ఆంధ్రజ్యోతి/ కార్పొరేషన్(కాకినాడ):


అక్కడకు వెళ్తే స్వచ్ఛమైన వాతావరణం స్వాగతం పలుకుతుంది. పచ్చని మొక్కలు ఆహ్వానం పలుకుతాయి. అవేమీ భారీగా ఉండవండి.. చిన్నచిన్నగానే ఉంటాయి. మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. అటువంటి ఆకర్షణీయమైన, ఆహ్లాదకరమైన ప్రాంతంగా.. అరుదైన బోన్సాయ్ మొక్కలకు నిలయంగా మారింది కాకినాడ జన్మభూమి పార్కు.. ఇక్కడి బోన్సాయ్ గార్డెన్‌కు వెళ్తే మనసు ఒక్కసారిగా తేలికపడుతుంది. ఆ చిన్నచిన్న మొక్కలను చూస్తేనే చాలు ఎంతో ముచ్చట గొలుపుతుంది. కాకినాడ నగరపాలక సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ బొన్సాయ్ గార్డెన్ గురించి తెలుసుకుందాం..

బొన్సాయ్ అంటే..

బొన్సాయ్ అంటే జపనీస్ భాషలో చిన్నకుండీలో పెరిగిన చెట్టు అని అర్థం. పూర్తిగా పెరిగిన వృక్షాల్లాగే అచ్చుగుద్దినట్లు చిన్న పరిమాణంలో ఉంటాయి. పరిసరాలకు అదనపు అందం తెచ్చిపెట్టే ఈ బొన్సాయ్‌లు ఎవరి దృష్టినైనా ఇట్టే ఆకర్షిస్తాయి. బొన్సాయ్‌లు పెద్ద చెట్టు లక్షణాలే పూర్తిస్థాయిలో కలిగి ఉంటాయి.

120 మొక్కలతో..

కాకినాడలోని జన్మభూమి పార్కులో వివిధ రకాల జాతులకు చెందిన 100 నుంచి 120 మొక్కలను అందంగా అలంకరించారు. 2018లో రూ.40లక్షల నిధులతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ మొక్కలను హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి ఇక్కడ పెంచుతున్నారు. ఈ వృక్షాలను చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.







సంరక్షణిలా..

కాకినాడ నగరపాలక సంస్థ సహకారంతో జన్మభూమి పార్కులో బోన్సాయ్ మొక్కల సంరక్షణకు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వేసవికాలంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో స్ప్రింకర్ల ద్వారా మొక్కలకు వాటరింగ్ చేస్తారు. మిగిలినకాలంలో రోజుకు ఒకసారి మాత్రమే మొక్కలకు పడతారు. ఎండ ఎక్కువగా తగలకుండా మొక్కలు చుట్టూ గ్రీన్‌మేట్ అమర్చారు. బయట వాతావరణ పరిస్థితులు కంటే బోన్సాయ్ మొక్కలకు వాతావరణ పరిస్థితులను కొంచెం చల్లగా ఉండాలి. తెగుళ్లు రాకుండా శీతాకాలంలో వేపనూనె కలిపిన కెమికల్స్ స్ప్రే చేస్తారు. మిగిలిన రోజుల్లో న్యూట్రిషనల్ స్ప్రే చేస్తారు. 1:1:1 రేషియోలో మట్టి, వర్మికంపోస్టు, కొబ్బరి పీచు వేస్తుంటారు. తద్వారా మొక్కలు నీరు తీసుకోవడంలో సమతుల్యత ఉంటుంది. బోన్సాయ్ మొక్కల నిర్వహణ చాలా జాగ్రత్తగా చూసుకోకపోతే మొక్కలు చనిపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల వీటి నిర్వహణపట్ల చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఎగిరిపోతే...!

పైకి ఎగిరిపోతూ..



కాకినాడ జిల్లా గొల్లప్రోలు జాతీయ రహదారి పక్కన దమ్ము పొలాల్లో కనువిందు చేస్తున్న కొంగలు

గాల్లో తేలిపోతూ..



ఫొటోలు: ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్/కాకినాడ

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వరినాట్లు, దమ్ములు జోరుగా సాగుతున్నాయి. పొలాల్లో వరి నాట్లు వేసేందుకు ట్రాక్టర్లతో రైతులు దమ్ములు ముమ్మరంగా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లోకి వస్తున్న కొంగలు కనువిందు చేస్తున్నాయి. దమ్ము చేలను చుట్టుముడుతూ.. పైకి ఎగురుతూ.. గాల్లో తేలుతూ.. వీనుల విందు చేస్తున్నాయి. పొలాల్లో వాటికి దొరికే ఆహారం కోసం వచ్చే ఈ కొంగలు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. ఇంకెందుకు ఆలస్యం మీరు మీదగ్గర్లో ఉండే దమ్ము పొలాల్లో వెళ్లి చూస్తే ఇలాంటి కొంగలు ఎగురుతూ.. కనిపిస్తాయి.. వెళ్లి చూసేయండి మరి..!

పొలాన్ని చుట్టుముడుతూ..



కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని పొలాల్లో ట్రాక్టర్లు దమ్ము చేస్తుండగా పురుగులు తింటున్న కొంగలు

భక్తజన సంద్రం వాడపల్లి

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.39.57లక్షలు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



వాడపల్లి వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.39.57 లక్షలు లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

అప్పనపల్లి ఆలయంలో..

మామిడికుదురు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో కొత్త, పాల ఆలయాలు కిక్కిరిసిపోయాయి. తలనీలాలు సమర్పించే భక్తులతో కల్యాణకట్ట కిటకిటలాడింది. శనివారం పురస్కరించుకుని అర్చకులు వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం గోవింద నామస్మరణతో మార్మోగింది. శనివారం ఒక్కరోజు రికార్డు స్థాయిలో 9200 మంది భక్తులు దర్శించుకుని దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకంలో 5200 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.4,88,506 ఆదాయంగా సమకూరిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



అప్పనపల్లి బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

శృంగారవల్లభస్వామికి భక్తుల రద్దీ



తిరుపతి శృంగారవల్లభస్వామి

పెద్దాపురం, .జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించు కున్నా రు. తెల్లవారు జామునుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,00,920, అన్నదాన విరాళాలు రూ.87,090 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,800, తులాభారం, కానుకలు ద్వారా రూ.950, వెరసి రూ. 2,94,760 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు ఆరువేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్రాహ్మణ క్రికెట్ పోటీలు ప్రారంభం

పోటీలో తలపడుతున్న 20 జట్లు

అమలాపురం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అక్షింతలు పట్టుకునే చేతులతో క్రికెట్ బ్యాట్‌లు, బాల్స్ పట్టుకున్నారు. కూర్చొని కల్యాణ క్రతువులు నిర్వహించే పురోహిత బ్రాహ్మణులు గ్రౌండ్‌లో పరుగులు తీశారు. అమలాపురం కిమ్స్ వైద్యకళాశాల క్రీడా ప్రాంగణంలో కోనసీమ బ్రాహ్మణ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో రెండోసారి రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం ప్రారంభించారు. పంచకట్టుతో వచ్చిన బ్రాహ్మణ పురోహితులకు ఉపద్రష్ట కృష్ణమూర్తి పేరిట క్రీడా దుస్తులను అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి అందజేశారు. క్రీడా ట్రోఫీలను ఆవిష్కరించి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను టాస్‌వేసి ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. పురోహితులకు ఆట విడుపుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. క్రికెట్ క్లబ్ ప్రతినిధులు ఉపద్రష్ట విజయాదిత్య, పెద్దింటి అక్షయ్, కర్రా బాబి, ఉపద్రష్ట నాగార్జున, ఆకొండి పవన్, మహేంద్రాదిత్య, గండికోట సాయిలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. తొలిరోజు విజయవాడ-అన్నవరం జట్లు తలపడగా అన్నవరం జట్టు విజేతగా నిలిచింది. కాకినాడ రుద్రాస్-రాజమహేంద్రవరం జట్లు తలపడగా కాకినాడ రుద్రాస్ విజేతగా నిలిచింది. కాకినాడ-2 శరవణభవ జట్టు నర్సీపట్నం జట్టుతో తలపడగా నర్సీపట్నం జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 20 జట్లు వచ్చినట్టు ఉపద్రష్ట నాగాదిత్య, అనప్పిండి నర్సింహమూర్తి తెలిపారు. ఖమ్మం, మోపిదేవి, గుంటూరు, వైజాగ్, భీమవరం, నందిగామ, తాడేపల్లిగూడెం తదితర జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని వివరించారు. ప్రారంభోత్సవ కిమ్స్ రఘు, నేతాజీ, కడియాల శ్రీను పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత పరిషత్ క్రికెట్ టోర్నమెంట్‌ను టాస్‌వేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



విజయదుర్గా పీఠంలో వేంకటేశ్వరస్వామి కల్యాణంను తిలకిస్తున్న పీఠాధిపతి గాడ్

రాయవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ 89వ జన్మదిన వేడుకల్లో భాగంగా రెండోరోజు శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం పీఠంలో వైభవంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీనివాస గోవింద...శ్రీవెంకటేశా గోవిందా.. అంటూ భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపారు. వైఖానస ఆగమం ప్రకారం జరిగిన కార్యక్రమంలో తొలుతగా పీఠంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణ కార్యక్రమంలో భాగంగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, సజ్జు అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, మధుపర్క సమర్పణ, కన్యాదానం, మాంగళ్యపూజ, మాంగళ్యదారణ, తలంబ్రాలు కార్యక్రమాలతో స్వామివారి కల్యాణం శాస్రోక్తంగా నిర్వహించి హోమం, పూర్ణాహుతి జరిపించారు. అనంతరం వేంకటేశ్వరస్వామికి సహస్రనామాలతో కుంకుమార్చనలు నిర్వహించి అర్చక స్వాములు శ్రీనివాసుని కల్యాణం విశిష్టతను భక్తులకు వివరించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ ప్రత్యక్షదైవం శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకించడంవల్ల సకలశుభాలు కలుగుతాయన్నారు. ప్రవచనకర్త డాక్టర్ గొర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి శ్రీనివాస కల్యాణాన్ని వివరిస్తూ చేసిన వ్యాఖ్యానం ఆకట్టుకుంది. కల్యాణం అనంతరం వేదపండితులు పీఠాధిపతి గాడ్‌కు శ్రీనివాసుని ప్రసాదాన్ని అందజేశారు. భక్తులకు గాడ్ ఆశీస్సులు అందుకున్నారు.

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.1.84లక్షలు

కొత్తపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,84,912 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



మందపల్లి శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బాస్కెట్‌బాల్ టోర్నీ విజేతలకు ట్రోఫీలు అందజేత

ముగిసిన బాస్కెట్‌బాల్ టోర్నమెంటు పోటీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ),జనవరి18 (ఆంధ్రజ్యోతి):బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఈస్ట్‌గోదావరి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కృత్తివెంటి పేర్రాజుపంతులు క్రీడాప్రాంగణంలో మూడురోజులపాటు 14వ ఆలిండియా, 20 ఏపీ బాస్కెట్‌బాల్ టోర్నమెంటు పోటీలు శుక్రవారం అర్ధరాత్రితో ముగిశాయి. బాస్కెట్‌బాల్ టోర్నీ పురుషుల జట్టు విజేత సీఆర్‌పీఎఫ్ చండీఘర్ జట్టుకు రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ ట్రోఫీ అందజేశారు. బాస్కెట్‌బాల్ టోర్నీ మహిళలజట్టు విజేత ఎస్ఆర్ఎం చెన్నై జట్టుకు పారిశ్రామికవేత్త అడ్డూరి సంతోష్ వర్మ ట్రోఫీ అందజేశారు. రన్నరప్ జట్టు పటేల్ అకాడమీ చత్తీసగడ్ జట్టుకు డా.కోటసతీష్‌కుమార్, రన్నరప్ పురుషుల జట్టుకు చిత్తూరు జట్టుకు మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, మూడవ స్థానం పొందిన రామచంద్రపురం మహిళలు, సెంట్రల్ టాక్స్ హైదరాబాద్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. ట్రోఫీ ప్రదానోత్సవ సమావేశంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్‌ఏపీ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, డా.చెలికాని రామారావు, మాజీ క్రీడాకారులు, టీడీపీ నాయకులు అక్కల రిష్వంత్‌రాయ్, జనసేన నాయకుడు గొల్లపల్లి కృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.



టోర్నీవిజేత సీఆర్‌పీఎఫ్ చండీఘర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డాక్టర్ స్టాలిన్



టోర్నీ విజేత ఎస్ఆర్ఎం చెన్నై జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అడ్డూరి సంతోష్ వర్మ

సందేశమిస్తూ.. సామాజిక అంశాలను స్పృశిస్తూ

భోగాపురంలో ఆకట్టుకుంటున్న జాతీయస్థాయి నాటిక పోటీలు


అసత్యం నాటికలోని ఓ సన్నివేశం


ఇది రహదారి కాదు నాటికలోని ఓ సన్నివేశం

పిఠాపురం/పిఠాపురం రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు లక్షల్లో సంపాదిస్తూ పిల్లలు కనకపోవడం, దానికి డింక్ (డబుల్ ఇన్‌కమ్ నో కిడ్స్) అని పేరు పెట్టడం ఏ సంస్కృతి. ఇందుకోసం మాతృత్వాన్ని పణంగా పెట్టడం తగదు అంటూ సందేశాన్ని ఇస్తూ, అదే సమయంలో పలు సామాజిక అంశాలను స్పృశిస్తూ ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి నాటిక పోటీల్లో భాగంగా రెండోరోజు 3 నాటికలను ప్రదర్శించారు. నేటి యువతరం ప్రయాణిస్తున్న పెడ ధోరణులను వివరిస్తూ వారిని సరైన మార్గంలో పెట్టాలని హైదరాబాదు మిత్ర క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన ఇది రహదారి కాదు నాటిక చాటిచెప్పింది. మన దేశంలో కావాల్సినంత స్వేచ్ఛ ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలి తప్ప వక్రమార్గం పట్టించవద్దని, పిల్లలను కనబోమని చెబుతూ దానికి వింత పేర్లు పెట్టుకోవడం తగదని హితవు పలికారు. పంది కూడా తన పిల్లలను సంరక్షించుకోవడానికి ఎంతకైనా తెగిస్తుందని, అటువంటి పవిత్రమైన మానవ జన్మ పొందిన మనం పిల్లలు లేకుండా చేసుకుంటారా అని ప్రశ్నించారు. దుర్భరమైన జీవితాన్ని గడుపుతూ గ్రాండ్‌మాస్టర్‌ను అందించిన తల్లి జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని చెబుతూ దారి తప్పిన ఒక యువజంటను చక్కదిద్దిన విషయాన్ని ఈ నాటికలో ప్రదర్శించారు. ఆకురాత్రి భాస్కరచంద్ర ఈ నాటికను రచించగా, ఎస్ఎం భాషా దర్శకత్వం వహించారు.

జీవితం ఒక రంగస్థలం

జీవితం ఒక రంగస్థలమని, ఇందులో అందరు నటీనటులేనని, ఎవరి పాత్ర వారి పోషించి అదృశ్యమవుతారని, ఆ పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసే వారే మహానటులని విజయవాడ అభ్యుదయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఆంగీకం భువనం యస్య నాటిక ద్వారా తెలియజేశారు. ఆర్థిక అంశాలతో ముడిపడిపోతున్న జీవితాల్లో ప్రేమానురాగాలకు స్థానం ఉండదని, తాను బాధపడుతూ, ప్రాణాపాయస్థితికి చేరిన తన వద్ద డబ్బును భర్తకు అందించడం, వైద్యులు వారిస్తున్నా నాటక ప్రదర్శనలో పాల్గొని స్వర్ణ కమలం సాధించి అదే వేదికపై ఒరిగిపోయిన ఒక కళాకారిణి ఇతివృత్తాన్ని ప్రదర్శించారు. అనంత హృదయరాజు ఈ నాటికను రచించగా, వేంపాటి రమేష్ దర్శకత్వం వహించారు.

కంటికి కనిపించేది అంతా సత్యం కాదు, కనిపించనది అసత్యం కాదని విశాఖ ఉక్కునగరానికి చెందిన చైతన్య కళాస్రవంతి కళాకారులు తాము ప్రదర్శించిన అసత్యం నాటిక ద్వారా వివరించారు. యధార్థమైనా సరే చెడుకు దోహదపడితే అది అసత్యం, అబద్ధమైనా అది మంచికి ఉపయోగపడితే అది సత్యమని చాటిచెబుతారు. మోదుగు శ్రీసుధ రచించిన కథను పిన్నమనేని మృత్యుంజయరావు నాటకీకరణ చేయగా, పి.బాలాజీనాయక్ దర్శకత్వం వహించారు.

వారాహి పురస్కారం అందజేత

ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు సీహెచ్.మహేష్‌కు వారాహి విశిష్ట రంగస్థల ప్రతిభా పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు,కళాకారులు పాల్గొన్నారు.


దర్శకుడు మహేష్‌కు వారాహి విశిష్ట రంగస్థల ప్రతిభా పురస్కారం అందజేస్తున్న దృశ్యం

చెస్‌తో మేధాశక్తి పెంపుదల

● ఆల్‌ఇండియా చెస్ ఫెడరేషన్ అర్బిటర్స్ కమిషన్ చైర్మన్ రాజేశ్
● 'శ్రీప్రకాష్'లో రెండో రోజు జాతీయస్థాయి చెస్ పోటీలు


రాజేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం


చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పెద్దాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మేధాశక్తి పెంపొందించేందుకు చెస్ దోహద పడుతుందని ఆల్‌ఇండియా చెస్ ఫెడరేషన్ అర్బిటర్స్ కమిషన్ చైర్మన్ ఆర్.రాజేష్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో జరుగుతున్న జాతీయ స్థాయి స్కూల్ చెస్ చాంపి యన్ షిప్ పోటీల్లో భాగంగా రెండవ రోజు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. చెస్‌లో ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీప్రకాష్ పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు తమలోని దాగి ఉన్న మేధా శక్తిని వెలికి తీయడానికి ఈ పోటీలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు.పోటీలను తిలకించి క్రీడాకారులకు మెళకువలను నేర్పించారు. కార్య క్రమంలో ఏపీ చెస్ అసోసియేషన్ చైర్మన్ కేవీవీశర్మ, కార్యదర్శి ఏసీఏ అడుసుమిల్లి, అనంతరామ్, పాఠశాల డైరెక్టర్ సీహెచ్. విజయ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'నవోదయ' ప్రవేశ పరీక్ష


ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

పెద్దాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయలో ఆరవ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. ప్రవేశ పరీక్ష కోసం 8971 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6499 మంది విద్యార్థులు హాజరయ్యారని, 2472 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని చెప్పారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు...

రూ.11 వేల కోట్ల ప్యాకేజీ హర్షణీయం

ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్లు ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ సమస్యను ఎప్పటికప్పుడు లేఖల ద్వారా ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనేకసార్లు కార్మికులను కేంద్రమంత్రి కుమారస్వామి వద్దకు తీసుకెళ్లి వారి ఇబ్బందులను వివరించామని, ప్రైవేటీకరణ చేయబోమని కుమారస్వామి తమకు ధైర్యం చెప్పారని తెలిపారు. కేంద్రంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఉండడం వల్లే ఆశించిన కల సాకారమైందన్నారు.

ఫిబ్రవరి 4 నుంచి అంతర్వేదిలో...

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

● అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధం కావాలి ● ముందస్తు ఏర్పాట్లపై కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, పాల్గొన్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాస్థాయి అధికారులతో కల్యాణోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4 నుంచి 13వ తేదీ వరకు కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 4న రథసప్తమి నుంచి కల్యాణోత్సవాలు ప్రారంభమై 10 రోజుల పాటు గ్రామోత్సవం, స్వామివారి దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. 5వ తేదీన గరుడ పుష్పక వాహనంపై మాడవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం, 6న హంస వాహనం, 7న గజమాల అలంకరణ కార్యక్రమం అనంతరం రాత్రి 10.30 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు స్వామివారి తిరుకల్యాణోత్సవం, భద్రాద్రి రాములోరి కల్యాణం మాదిరిగా ఆరుబయట ప్రాంగణంలో వైభవంగా జరుగుతుందన్నారు. అనంతరం భక్తులు శిఖర దర్శనం చేసుకుంటారని ఆయన తెలిపారు.

12ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు

స్వామివారి కల్యాణాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా 12ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కవరేజ్ కోసం ప్రత్యేక కంపార్టుమెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయంలో వీఐపీ, శీఘ్ర సాధారణ దర్శనాల కోసం మూడు క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 8న అక్షింతల సేకరణ పంపిణీ కార్యక్రమాలు, స్వామివారి రథోత్సవం జరుగుతుంది. 9, 10, 11 తేదీల్లో స్వామివారి గ్రామోత్సవాలు, దర్శన కార్యక్రమాలు యథావిధిగా ఉంటాయి. 12న స్వామివారి చక్రవారీ సముద్రస్నానం, ఉదయం 8 గంటల నుంచి సంప్రోక్షణ, స్వామి అర్చన కార్యక్రమాలు, వేద పురోహితులు నిర్వహిస్తారు. 13న నదీ విహారంలో మూడు రౌండ్లుగా తెప్పోత్సవం కార్యక్రమం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహిస్తారు. ఆర్టీసీ అధికారులు భక్తుల సౌకర్యార్థం దేవాలయం వరకు బస్సులు నడిపే అవకాశాలపై ప్రాథమిక సర్వే నిర్వహించాలని ఆర్అండ్‌బీ, ఆర్టీసీ అధికారులకు సూచించారు. స్నానఘట్టాల వద్ద భక్తుల భద్రత కోసం మత్స్యశాఖ ఆధ్వర్యంలో నాలుగు రెస్క్యూ బోట్లు, వంద మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక పోలీసులు మెరైన్ పోలీసులను సమన్వయం చేసుకుని భక్తుల శాంతి భద్రతల పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు దేవస్థానం బయట బారీకేడింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీర్లు అంతర్గత రోడ్ల నిర్మాణం, సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి కంట్రోల్ రూముకు అనుసంధానం చేయాలని కలెక్టర్ తెలిపారు.

నిరంతరం విద్యుత్ సరఫరా

పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, లైటింగ్‌ను భక్తులు సంచరించే రహదారి పొడవునా ఏర్పాటు చేయాలన్నారు. దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ రూము నుంచి భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు 60 తాత్కాలిక మరుగుదొడ్లతో పాటు తాగునీటి వసతి సౌకర్యాలు సమృద్ధిగా కల్పించాలన్నారు. డీపీవో ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను నియమించి సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. రథోత్సవానికి వీలుగా మాడవీధుల్లో తొలగించిన విద్యుత్ వైర్లను రథోత్సవం ముగిసిన తరువాత తిరిగి పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఐదు ప్రాథమిక వైద్య శిబిరాలు, అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలన్నారు. అబ్కారీ అధికారులు పది రోజుల పాటు మద్యం షాపులను మూసివేయించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ స్వామివారి కల్యాణం, తెప్పోత్సవం, సముద్ర స్నానఘట్టాల ప్రక్రియల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అధికారులంతా పూర్తి సమన్వయంతో వ్యవహరించి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా పాల్గొంటాయన్నారు. డీఐపీఆర్వో నేతృత్వంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఉత్సవాల కవరేజ్ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో కె.మాధవి, అదనపు ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ,జిల్లాస్థాయి అధికారులు ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


బలభద్రపురంలో మృతిచెందిన శ్రీను

బిక్కవోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. గ్రామ వీఆర్వో మాచవరపు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తికి చెందిన గదుల శ్రీను (57) బలభద్రపురంలోని రామకృష్ణ ఇంజనీరింగ్ వర్క్‌షాపులో పనిచేస్తున్నాడు. వర్క్‌షాప్‌లో పని నిమిత్తం గ్రామంలో వేరే చోటకు వెళ్లి తిరిగి మోటార్‌సైకిల్‌పై శ్రీను వస్తుండగా దేవి సెంటర్‌లోని గుబ్బాలమ్మ గుడి వద్ద వెనుక నుంచి కొమరిపాలెం మురళీమోహన రైస్‌మిల్లుకు చెందిన లారీ ఢీకొనడంతో సిమ్మెంట్‌రోడ్డుపై పడి తలకు తీవ్రగాయాలు కాగా అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసులకు వీఆర్వో సమాచారం అందించారు.

'మెడికల్ కాలేజీ సీట్ల సర్దుబాటు విధానం మార్చుకోండి'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కాలేజీ సీట్లు విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులే కూటమి ప్రభుత్వం కూడా చేస్తుందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో శనివారం విలేకరులతో మాట్లాడారు. సీట్లు సర్దుబాటు విధానం మార్చుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం లోపభూయిష్టంగా ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హర్షకుమార్ తనయుడు జీవీ.సుందర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రులైన ఓటర్ల సమగ్ర డేటాను కూటమి అభ్యర్థి తస్కరించారని, దీనిపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి కర్ణాటక సంగీత గాత్ర, వీణా వాయిద్య పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 18(ఆంధ్రజ్యోతి): సంగీత విద్వాత్ సభ 77వ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడ సూర్యకళామందిరంలో ఈనెల 19 నుంచి 26 వరకు రాష్ట్రస్థాయి కర్ణాటక సంగీత గాత్ర, వీణా వాయిద్య పోటీలు నిర్వహిస్తున్నారు. 19న ఉదయం 9గంటల నుంచి నిర్వహించే పోటీల్లో 16 ఏళ్లల్లోపు బాలబాలికలు జూనియర్లు గాను, 17ఏళ్ల నుంచి 26ఏళ్ల మధ్య వారు సీనియర్లు గాను పరిగణిస్తామని నిర్వాహకులు తెలిపారు.

జూనియర్ల విభాగం పోటీల్లో పాల్గొనేవారు ఆది తాళవర్ణం రెండో తాళంలో పాడాలి.. వాయించాలి. మూర్తిత్రయం కృతుల్లో కనీసం ఇద్దరి కృతులు, పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్‌వారి కృతి అందజేసి అందులో న్యాయ నిర్ణేతలు కోరిన కృతిని పాడి, వాయిం చాల్సి ఉంది.

సీనియర్ల విభాగంలో ఆది తాళవర్ణం రెండో తాళంలో పాడాలి, వాయించాలి. మూర్తిత్రయం కృతుల్లో కనీసం ఇద్దరి కృతులు, పట్నం సుబ్రహ్మణ్యం అయ్య వారి కృతి అందజేసి అందులో న్యాయనిర్ణేతలు కోరిన కృతిని పాడి,వాయించాలి. రాగం నెరవల్, స్వరం చేయడం తప్పనిసరి.

బహుమతులు ఇలా...

గాత్ర విభాగంలో సీనియర్లకు ప్రథమ బహుమతి రూ.4వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు. జూనియర్ల విభాగంలో ప్రథమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.వెయ్యి. వీణ విభాగంలో సీనియర్లకు ప్రథమ బహుమతి రూ.4వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు, జూనియర్ల విభాగంలో ప్రథమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.వెయ్యిగా ఇవ్వనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు.

పీసా చట్టంపై శిక్షణా తరగతులు

సామర్లకోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా సామర్లకోట ఈటీసీ ఆవరణలో నిర్వహిస్తున్న 2రోజుల శిక్షణా తరగతులను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. కేంద్రం ఆవరణలో శనివారం పీసా చట్టంపై మొదటి బ్యాచ్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి వరకు 5 జిల్లాలకు సంబంధించి సుమారు 108మంది హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రణాళికలు రూపొందించేందుకు ఇటువంటి శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని, ఇక్కడ శిక్షణ పొందిన ఎంపోటీలు క్షేత్రస్థాయిలో కింది స్థాయి అధికారులకు ఇవ్వాల్సిఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. జాయింట్ డైరక్టర్ శ్రీదేవి, డిప్యూటీ డైరెక్టర్ రామనాధం పలు అంశాలపై సమగ్రంగా వివరించారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంపోటీలు ఏజెన్సీ ప్రాంతాల అధికారులకు ఫిబ్రవరి, మార్చిలో 2 రోజుల శిక్షణా తరగతులు ఇవ్వాల్సి ఉందన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు శ్రీనివాసరావు, ఆంజనేయులు, ఎం.చక్రపాణీరావు, వి.ప్రసాద్, నీహారిక, డీఆర్ఎన్ పద్మజ పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసినవారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్



కానిస్టేబుల్ అభ్యర్థులకు

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు


పరుగు పందెంలో పురుష అభ్యర్థులు

కాకినాడ క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా జరుగుతున్న పురుష, మహిళల దేహదారుఢ్య పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఏపీఎస్పీ ఐఆర్ బెటాలియన్‌లో 630 కానిస్టేబుళ్లు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 381 సివిల్ కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకిగాను జరిగిన ఈ ఎంపిక ప్రక్రియకు 6,333మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 4993మంది హాజరై 2857మంది అర్హత సాధించారు. 1,449 మంది మహిళా అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1066మంది హాజరై 472మంది అర్హత సాధించారు. మొత్తంగా కలిపి 7,782మంది హాజరుకావాల్సి ఉండగా 6059 మంది హాజరై 3329మంది అర్హత సాధించారు. గతనెల 30న ప్రారంభమైన ఈ దేహదారుఢ్య పరీక్షలు ముగిశాయి. శనివారం పురుష, మహిళా అభ్యర్థులు కలిసి మొత్తం 564 మంది హాజరు కాగా తదుపరి పరీక్షకు 318మంది అర్హత సాధించారు. పరీక్షలను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావ్ పర్యవేక్షించారు.


మహిళల ఎత్తు పరిశీలిస్తున్న దృశ్యం

కబడ్డీ పోటీలకు రిఫరీల ఎంపిక


రిఫరీలను అభినందిస్తున్న డీఈవో రమేష్

సామర్లకోట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో ఈనెల 28 నుంచి జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కాకినాడ జిల్లాకు సామర్లకోటకు చెందిన బోగిళ్ళ మురళీకుమార్, గుడారి గుంట పీడీ ఎం.శ్రీనివాసకుమార్‌ను ఎంపిక చేస్తూ జాతీయ స్థాయి క్రీడా మండలి నుంచి ఉత్తర్వులు రావడంతో శనివారం వారిని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అభినందించారు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి ప్రోకబడ్డీ పోటీలకు న్యాయ నిర్ణేతగా మురళీకుమార్ పలు దఫాలు హాజరైన విషయం విధితమే. జాతీయస్థాయిలో జరగనున్న కబడ్డీ పోటీలకు కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లు ఎంపిక కావడం జిల్లాకే ఎంతో గర్వకారణం అని డీఈవో అభినందించారు. వారిని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు విక్టరీ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎలమంచిలి శ్రీకాంత్ అభినందించారు.

గణతంత్ర వేడుకలకు 'ముక్కామల' బృందం


బృంద సభ్యులు

అంబాజీపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని కర్తవ్యథ్‌లో ఈ నెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ఏపీ శకటం వద్ద ప్రదర్శన ఇచ్చేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల పుసపులేటి నాగబాబు, కుమార్‌ల కళాకారుల బృందం 16మంది సభ్యులు ఎంపిక య్యారు. ఈ నెల 12న ఢిల్లీ చేరుకుని రీహార్సల్స్ చేస్తున్నారు. 26న ఏపీ కొప్పాక బొమ్మల ఆంధ్రప్రదేశ్ శకటాన్ని ఏపీ తరుపున ఢిల్లీలో ప్రదర్శించనున్నారు. ఢిల్లీలో నాగబాబు బృందానికి మూడోసారి ఏపీ తరుపున ప్రదర్శన ఇచ్చేందుకు అవకాశం దక్కింది. 2003లో జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల థీమ్‌ను ప్రదర్శించిన సమయంలో నాగబాబు బృందం ఆకట్టుకుంది. కోనసీమ ప్రభల థీమ్‌ను ఢిల్లీలో జరిగిన పరేడ్‌లో ప్రదర్శించి ప్రతిభ కనబరిచారు. మరోసారి ఐఅండ్‌పీఆర్ జేడీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 26న జరిగే ప్రదర్శనలో పాల్గొనడం పట్ల నాగబాబు బృందం కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 18(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వద్దని కమిషనర్ భావన సిబ్బందికి సూచించారు. పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా శనివారం తెల్లవారు జామున నగరంలో తొమ్మిదో సర్కిల్, పెద్ద మార్కెట్ ప్రాంతంలో పర్యటించారు. చెత్త సేకరణ, వాహనాల్లో తరలింపు విషయాలను పరిశీలించారు.

తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్టీఆర్

● ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు, శ్రేణులు ● ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల సేవా కార్యక్రమాలు





కాకినాడలో చీరలు పంపిణీ చేస్తున్న కొండబాబు, నవీన్... సామర్లకోటలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న రాజప్ప, తాళ్లరేవు : ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి

కాకినాడ సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్టీఆర్ అని, పేద బడుగు వర్గాల అభ్యున్నతికి టీడీపీ నిరంతరం కృషి చేస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాలు నగరంలో పలుచోట్ల శనివారం జరిపారు. ఎమ్మెల్యే కొండబాబు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు నవీన్, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యాలయం, జిల్లా పరిషత్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహాలకు గజమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాంతినగర్‌లో మాజీ కార్పొరేటర్ సీకోటి అప్పలకొండ ఆధ్వర్యంలో 300మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. జీజీహెచ్ ఎన్టీఆర్ బస్‌షెల్టర్ వద్ద పేదలకు అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, నాయకులు గదుల సాయిబాబు, కొల్లాబత్తుల అప్పారావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఎంఏ తాజుద్దీన్, బోళ్ల కృష్ణమోహన్, ఎండీ అన్సర్, అమన్‌జైన్, బలసాడి రంగారావు, తుమ్మల సునీత రమేష్, అమలకంటి బలరామ్, సీకోటి అప్పలకొండ, బంగారు సత్యనారాయణ, ఏవీడీ మెంటారావు, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, చింతలపూడి రవి, జొన్నాడ వెంకటరమణ, రెడ్డం సత్తిబాబు, పాలిక నాని పాల్గొన్నారు.

నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, రైస్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెకుకూరి సాయిరాంవర్మ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్న ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజ్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బత్తుల సూర్యప్రసాద్, ప్రత్తిపాడు అధ్యక్షుడు అడపా జగదీష్, మండపాక వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: తెలుగుజాతి ఔన్నత్యాన్ని దశదిశలా విస్తృతం చేసిన నందమూరి తారక రామారావు చిరస్మరణీయుడని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మఠం సెంటర్ ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రాజప్ప హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనం నివాళులర్పించారు. అంతకుముందు మండలంలోని పి.వేమవరంలో టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాసు, గ్రామ టీడీపీ నాయకులు మునిరెడ్డి శ్రీరాములు, మునిరెడ్డి రాంబాబుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి రాజప్ప పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్, కుర్రా నారాయణ స్వామి, పెంకే వెంకటేష్, శ్రీపతి అప్పారావు, వెన్నా దివాణం, పోతుల శ్రీను పాల్గొన్నారు. అంతకుముందు సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రాజప్ప పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే చినరాజప్ప పూలమాల వేసి నివాళులర్పించారు.

సర్పవరం జంక్షన్: బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచి రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించి ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో అవకాశం కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి అన్నారు. సర్పవరం జంక్షన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 5 వేల మందికి భారీ అన్నదానం నిర్వహించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, శిరంగు శ్రీనివాసరావు, తాటికాయల వీరబాబు, పాండ్రంగి రాజు, పుల్ల శ్రీరాములు, పలివెల త్రిమూర్తులు, కొండా వినాయక్,జంక్షన్ బాబ్జీ,మరుకుర్తి తేజయాదవ్, నాగబాబు ఉన్నారు.

పెద్దాపురం: ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి) పేర్కొన్నారు. మండల పరిధిలోని దివిలి ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కాండ్రకోట గ్రామంలో టీడీపీ నేత ఎలిశెట్టి నాని ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివిలి, తిరుపతి సర్పంచ్‌లు పెంకే శ్రీను, మొయిళ్ల కృష్ణమూర్తి, మేడిది శ్రీనివాస్, రాగాల ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కరప: కరపలో టీడీపీ నేత డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నడకుదురులో మొక్కలు నాటిన అనంతరం స్థానిక జనావళి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గొర్రిపూడిలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి గండి వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి తదితరులు ఉన్నారు.

తాళ్లరేవు: గాడిమొగలో ఎన్టీఆర్ విగ్రహానికి వుంగరాల టీడీపీ నేత వెంకటేశ్వరరావు, టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ పూలమాలలతో నివాళులర్పించారు. తాళ్లరేవు ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీనేతలు నడింపల్లి వినోద్, నీటి సంఘం అధ్యక్షుడు సాయిరాజు, టీడీపీ నేతలు, కార్యకర్తలున్నారు.

పిఠాపురం: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఆశయసాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంతో పాటు బంగారమ్మరావిచెట్టు సెంటర్, ఇందిరానగర్, మిరపకాయల వీధిలో గల ఎన్టీఆర్ విగ్రహాలకు ఆయన శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. విరవాడ, నరసింగపురంలో కూడా వర్మ ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



సర్పవరంలో అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు



పిఠాపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి వర్మ నివాళి



కరప: గొర్రిపూడిలో నివాళులర్పిస్తున్న టీడీపీ నేత గండి వెంకటేశ్వరరావు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

జిల్లా హౌసింగ్ పీడీ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

సర్పవరం జంక్షన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో అసంపూర్తిగా నిలిచిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి మార్చి నెలాఖరు నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ సత్యనారాయణ ఆదేశించారు. శనివారం రమణయ్యపేట మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో గల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి బిల్లుల సమస్య లేదని, ఇంటి నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారులంతా వివిధ దశల్లో ఉన్న అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. మార్చినెల దాటితే పాత హౌసింగ్ స్కీమ్ రద్దు అవుతుందని, ఆ తర్వాత బిల్లుల మంజూరులో లబ్ధదారులకు ఇబ్బందులు తప్పవన్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను గుర్తించి, సత్వరమే అసంపూర్తి పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. కాకినాడ రూరల్, కరప మండలాలలో ఇళ్ల నిర్మాణాలు, వివిధ దశల్లో ఉన్న ఇళ్లు, గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్న ఇళ్లపై సమీక్ష నిర్వహించి తగిన సూచనలు చేశారు. సమావేశంలో ప్రత్యేక అధికారిణి సత్యవతి, ఈఈ వై.శ్రీనివాసరావు, కాకినాడ ఈవోపీఆర్డీ ఎంఎస్ఆర్ అంజనేయులు, కరప ఎంపీడీవో అనుపమ, హౌసింగ్ ఏఈ కె.నాగభూషణరావు తదితర అధికారులుఉన్నారు.

సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

పెద్దాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.చంద్రమౌళీశ్వరి శనివారం సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి అందుతున్న సదుపాయాలపై ఆరాతీశారు. ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సబ్ జైళ్లను సందర్శించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆమె వెంట ఆర్డీవో శ్రీరమణి, డీఎస్పీ శ్రీహరిరాజు, తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ, సబ్ జైల్ సూపరిన్‌టెండెంట్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

జంగిల్ బుక్ ఓపెన్ స్కూల్ ప్రారంభం

జేఎన్టీయూకే, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని ఐఎస్టీ విభాగం ఎదురుగా నవీకరించిన జంగిల్ బుక్ ఓపెన్ స్కూల్‌ను ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని శనివారం ప్రారంభించారు. యూసీఈకే ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారన్నారు. రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, సీఈ శ్రీనివాసులు, డీఈఈ సన్నీప్రాన్సిస్, ఏఈఈ నవీన్ ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ

రైతులు పంటపొలాలను పరిశీలించుకోవాలి

జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఎలీయాజరు

గొల్లప్రోలు రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పంటపొలాలను రైతులు ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఎలీయాజరు సూచించారు. చేబ్రోలులో పోసిన సతీష్ పకృతి వ్యవసాయ క్షేత్రంలో జిల్లాలోని ఎన్ఎఫ్ఏలు, ఎంటీలు, ఎంటీఎల్‌లు, మోడల్ మేకర్స్ డీఎంఎంటీలు, యూనిట్ ఇన్‌చార్జిలు ఐసీఆర్‌టీలకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. రబీలో రైతులు ఎదుర్కొనే సమస్యలు, పురుగులు, తెగుళ్ల యజమాన్య పద్ధతులు, సస్యరక్షణ పద్ధతులు, రైతుస్థాయిలో ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్ ఏ విధంగా చేయాలి తదితర అంశాలను వివరించారు. తక్కువ నీటితో మెట్ట వరి సాగుపై అవగాహన కల్పించారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే అన్ని రంగాల అభివృద్ధి






పిఠాపురం: ఇందిరానగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ ఆవరణ శుభ్రం చేస్తున్న వైద్యులు, సిబ్బంది, సామర్లకోటలో స్వచ్ఛాంధ్ర పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడ: పరిసరాలు శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్, కాకినాడ: పరిసరాలు శుభ్రపరుస్తున్న కమిషనర్ భావన, సిబ్బంది

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
● స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం

సామర్లకోట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజంతోనే అన్ని రంగాలూ అభివృద్ధి చెందుతాయని, అందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అందరూ స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పి.వేమవరం గ్రామంలో ఎంపీడీవో కార్యాలయం అధికారుల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చినరాజప్ప, ట్రైనీ కలెక్టర్ భావనలు హాజరయ్యారు. ముందుగా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞను ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ సిబ్బందితో ఎమ్మెల్యే చినరాజప్ప, ట్రైనీ కలెక్టర్ భావన చేయించారు. తొలుత గ్రామంలో కంపోస్ట్ డంపింగ్ యార్డును ఎమ్మెల్యే చినరాజప్ప, ట్రైనీ కలెక్టర్ భావన, తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో హిమమహేశ్వరి సందర్శించారు. గ్రామంలో పలు కూడలి ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరెడ్డి శ్రీరాములు, మునిరెడ్డి రాంబాబు, తోటకూర శ్రీనువాసు, కుర్రా నారాయణ స్వామి, చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, శ్రీపతి అప్పారావు, ఎలిశెట్టి భీమన్నదొర, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక మఠం సెంటర్ వద్ద స్వచ్ఛా ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ అధికారులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి సచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. మఠం సెంటర్ నుంచి పెద్దాపురం రోడ్డు మీదుగా స్వచ్ఛ ఆంధ్ర పాదయాత్ర నిర్వహించారు. అలాగే సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో స్టేషన్ సూపరింటెంటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ తదితర మున్సిపల్ రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మెప్మా సీఆర్పీలు, మెప్మా సిబ్బంది, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ దివస్ ర్యాలీ

సర్పవరం జంక్షన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వాకలపూడి గ్రామ పంచాయతీ గ్రామ కార్యదర్శి పిడుగు పాండు రంగారావు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి, ఈవోపీఆర్డీ ఎంఎస్ఆర్ రామాంజనేయులు మాట్లాడుతూ ఈకార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని, ప్రతీ నెలా మూడో శనివారం ఈకార్యక్రమం అమలు జరుగుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈసందర్భంగా పంచాయతీ నుంచి స్థానిక సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి సిబ్బంది, గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ సిబ్బంది కేసవ్, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు. పండూరులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పండూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కె.మాధవి, గ్రామ కార్యదర్శి ముత్యాల రామ్మోహన్‌చౌదరి ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

అర్బన్‌హెల్త్ సెంటర్‌లో చెత్త తొలగింపు

పిఠాపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ఇందిరానగర్‌లో గల అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం ఆవరణను శుభ్రం చేసి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. పచ్చదనం కోసం మొక్కలను సంరక్షిస్తామని, నీటిని వృథా చేయమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జయరాం, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

గొల్లప్రోలు, జనవరి18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గొల్లప్రోలు పట్టణంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరపంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీపురవీధుల్లో సాగింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని సంరక్షించాలని కోరారు. నగరపంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో ఎంపీడీవో కర్రి స్వప్న ప్రతిజ్ఞ చేయించారు.

శ్మశానవాటికలో స్వచ్ఛ దివస్

తాళ్లరేవు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు పంచాయతీ పెంకేవారిపేట శ్మశానవాటికలో ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. అధికారులు స్వచ్ఛాంధ్ర- దివస్ ప్రతిజ్ఞచేశారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు పరిసరాలను శుభ్రం చేశారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యవిభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర

జీజీహెచ్(కాకినాడ), జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ, రంగరాయ వైద్యకళాశాల, కాకినాడ జీజీహెచ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణాన్ని శనివారం పూర్తిగా శుభ్రపర్చారు. ఆర్ఎంసీ ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపాల్, డీఎంఈ, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణాన్ని అపరిశుభ్ర వాతావరణం నుంచి కాపాడే దిశగా శుభ్రపర్చారు. జీజీహెచ్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో హెల్త్ ఇన్స్‌స్పెక్టర్ సువర్ణరాజ్, సిబ్బంది ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రపర్చారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ శశి, ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంవీఆర్ విఠల్ పాల్గొన్నారు.

ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర

జేఎన్టీయూకే, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రారంభించిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని వర్సిటీలోని యూసీఈకే ప్రిన్సిపాల్ మోహన్‌రావు ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో మెకానికల్ ఇంజనీరింగ్, సీఎస్ఈ, ఈసీఈ, గ్రంథాలయ విభాగాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం వివిధ విభాగాల భాగస్వామ్యంతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. నెలనెలా ఒక ఇతివృత్తంతో ఏడాది పొడవునా 12 ఇతివృత్తాలతో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడతామన్నారు. పలువురు డైరెక్టర్లు, విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో నగర ప్రజలందరూ భాగస్వాములు కావాలని, కాకినాడను పరిశుభ్రమైన నగరంగా ఉంచాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. ప్రతినెలా మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలనే ఆదేశాల మేరకు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హాజరయ్యారు. ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈకార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. నగరపాలక అధికారులు, సిబ్బంది, సచివాలయ, పారిశుధ్య సిబ్బందితో కమిషనర్ భావన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీగా కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ సెంటర్ సమీపానికి వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట రహదారిని శుభ్రపరిచారు. అడిషనల్ కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఈ కామేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీ చరణ్, టీపీఆర్వో శైలజ, మేనేజర్ సత్యనారాయణ, ఆర్వో శిరీష్, అధికారులు పాల్గొన్నారు.

కొమరగిరిలో స్వచ్ఛ దివస్

కొత్తపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కొమరగిరి పంచాయతీ పరిధిలో బీచ్ రోడ్డులో పారిశుధ్యపనులు చేపట్టారు. ఈసందర్భంగా సచివాలయ సిబ్బంది, పారిశుధ్యకార్మికులతో బీచ్‌రోడ్డులో ఉన్న చెత్తను సేకరించారు. అనంతరం పారిశుధ్య నిర్వహణపై ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ డాక్టర్ కందేపల్లి సత్యశ్రీ, వజీఈ ఎంపీటీసీ కందేపల్లి నూకరాజు, కొత్తపల్లి ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చొల్లంగి వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పెద్దాపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత సమాజంలో అందరి బాధ్యతని ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఆర్డీవో కార్యాలయ పరిసరాలను ఆమె సిబ్బందితో కలిసి శనివారం శుభ్రం చేశారు. ప్రతిజ్ఞచేసి ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యాలయ ఏవో మాధవరావు, డీటీ భానుకుమార్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో డి.శ్రీలలిత ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. కార్యాలయం ఏవో సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఒక్క సంతకంతో మద్యపానాన్ని నిషేధించారు'



పిఠాపురంలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న మద్యపాన వ్యతిరేక ప్రచారకమిటీ, ప్రజాసంఘాల ప్రతినిధులు

పిఠాపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక్క కలం పోటుతో మద్యపానాన్ని నిషేధించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని మద్యపాన వ్యతిరేక ప్రచారకమిటీ, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి శనివారం వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దశలవారీగా మద్యపానాన్ని నిషేధించాల్సింది పోయి మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మద్యపాన వ్యతిరేక ప్రచారకమిటీ కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, ప్రతినిధులు వీఎస్ రెడ్డి, కరణం విశ్వనాథం, భాస్కరాచార్యులు, వనపర్తి సూర్యనారాయణ, వేమగిరి తరుణ్, కొయ్యల రమణ, పప్పుల వీరబాబు, ఈగల కొండబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానాజీ పరామర్శ

సర్పవరంజంక్షన్, జనవరి18(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గోపాలచెరువు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బత్తుల లక్ష్మీసురేఖ మృతిచెందగా ఆమె తల్లిదండ్రులను శనివారం తిమ్మాపురంలో స్థానిక నాయకులతో కలసి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పరామర్శించారు. డిగ్రీ చదువుకున్న కుమార్తె రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందని, కుటుంబానికి జనసేన పార్టీ, తానూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జనసేన సీనియర్ నాయకులు మాదారపు తాతాజీ, చోడిశెట్టి ఇంద్ర, బత్తుల దొరబాబు పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం

పిఠాపురం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): డయేరియా బారిన పడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. బి.ప్రత్తిపాడు గ్రామంలో ఆయన శనివారం పర్యటించి డయేరియా బాధితులను పరామర్శించారు. ఈసందర్భంగా వర్మ మాట్లాడుతూ వాంతులు, విరోచనాలతో ఒకరు మరణించగా, 12మంది అస్వస్థతకు గురైనట్టు గ్రామస్తులు తెలిపారన్నారు. పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

టీ షాపులో చోరీ

పిఠాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్‌రోడ్డులో విరవాడ-కోలంక రోడ్డు జంక్షన్‌లో ఉన్న టీ దుకాణంలో రాత్రి సమయంలో 2 రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. నగదుతో పాటు అందులోని వస్తువులు, తినుబండారాలను అపహరించారు. దుకాణ నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

వరి కుప్ప దగ్ధం

తొండంగి, జనవరి 18 (ఆంధరజ్యోతి): బెండపూడి గ్రామానికి చెందిన చెక్కా చిన్నకు చెందిన వరికుప్ప శనివారం దగ్ధమైంది. సుమారు రెండెకరాల పొలంలోని వరిపంటను కుప్పగా వేయగా దానికి నిప్పంటుకుని కాలిబూడిదైంది. తుని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో హెచ్‌సి భాస్కర్రాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు 1.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఎన్టీఆర్ సేవలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలి

● రంపచోడవరంలో ఎన్టీఆర్ వర్ధంతి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థానం పొందిన గొప్ప నాయకుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రధాన కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్, టీడీపీ నాయ కులు పి. అనంతమోహన్, అడబాల బాపిరాజు, వై.నిరంజనీదేవి, సలాది బాపిరాజు, చెల్లన్నదొర, చోటు, పెద్దకాపు, సురేష్, ఎస్.రాజు, సత్యవతి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు ఆశయ సాధన కోసం ప్రతిఒక్క కార్యకర్త కృషిచేయాలని జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు అన్నారు. శనివారం రేఖపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలో ఇందుకూరుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, మండల ప్రధాన కార్యదర్శి మట్టా మెహరబాబా గౌడ్, లంకా హరిబాబు, ముచ్చు నాగేశ్వరరావు, కంది కొండ గౌరీశ్వరి, త్రిమూర్తులు, జనసేన, బీజేపీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం: డొంకరాయిలో ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. గంగిరెడ్ల గురుమూర్తి, మద్దెల యాకోబు, అప్పారావు, మూర్తి, శివ, రమేష్, త్రినాథ్, నాగు, నూకరత్నం పాల్గొన్నారు.

చింతూరు: ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి మాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి మాట్లాడారు. రామారావు చౌదరి, మధుసూధనరావు, సయ్యద్ ఆసిఫ్, తుర్రం ముత్తయ్య, అణిగి చంద్రయ్య, శీలం తమ్మయ్య, నరసింహారావు, శ్రీరామమూర్తి, చిట్టిబాబు, సన్యాసిరావు, బాలకృష్ణ, ప్రసంగి, నూకాచారి, దూలయ్య, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండల కేంద్రంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ప్రెస్‌క్లబ్‌వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆపార్టీ నాయకుడు, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ మాట్లాడుతూ పేద వాడి ఆకలి తీర్చిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ఎడవిల్లి భాస్కరరావు, బరపాటి ప్రకాశరావు, మాజీ జడ్పీటీసీ కన్యకాపరమేశ్వరి, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, నోముల సత్యనారాయణ, గడ్డిపాటి ప్రసాద్, చెలకాని ఉమామహేశ్వరరావు, రంజిత్ పాల్గొన్నారు.

ఎటపాక: తెలుగుఖ్యాతిని ప్రపంచ నలుమూలల చాటిన గొప్ప మహనీయుడు టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని అరకు పార్లమెంటరీ కార్యదర్శి మువ్వా శ్రీనివాస్, కిలారి వెంకన్న, విజ్జగిరి రవితేజ, నలజాల శ్రీకాంత్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంను మండలంలోని పురుషోత్తపట్నం, నెల్లిపాక, ఎటపాక, లక్ష్మీపురం, గౌరిదేవిపేట, తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలువేసి నివాలర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పుట్టి రమేష్, కణితి మధు పాల్గొన్నారు.

స్వచ్ఛ దివస్‌లో ప్రజలు భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే శిరీషదేవి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రంపచోడవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో ప్రజల భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆమెతో పాటు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వం స్వచ్ఛ దివస్ కార్యాక్రమం ఏర్పాటుచేసిందన్నారు. ఎంపీపీ బంధం శ్రీదేవి మాట్లాడుతూ మన ప్రాంతం ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే గృహాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తొలుత ఐటీడీఏ పీవో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె.బాలకృష్ణ, ఎంపీటీసీలు కె.వంశీకృష్ణ, ఉలవల లక్ష్మి, సర్పంచ్ వడగల ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి షరీఫ్, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, డీఎల్‌పీవో నర్సింగరావు, ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర, తహసీల్దారు పి.రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి కె.లక్ష్మణ్, ఎంఈవో కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

వందన్ వికాస కేంద్రాల అభివృద్ధికి చర్యలు

ఏజెన్సీలో వందన్ వికాస కేంద్రాల అభివృద్ధికి చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. శనివారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో వెలుగు అధికారులు, ఏడు మండలాల వందన్ వికాస కేంద్రాల ప్రెసిడెంట్లతో వందన్ వికాస కేంద్రాలు అభివృద్ధిపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏజెన్సీలోని 114 వందన్ వికాస కేంద్రాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ పి.డేగలయ్య, డీపీఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, యాంయర్ పర్సన్ రామరాజు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలో ఇందుకూరు, ఇందుకూరుపేట తదితర గ్రామాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఎంపీడీవో రత్నకుమారి, ఏవో ప్రశాంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. . అనంతరం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని అధికారులు విజయవంతంగా నిర్వహించారు. రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తహసీల్దార్ వేణుగోపాల్ పలు శాఖలాధికారులు, సిబ్బంది, టీడీపీ మండలాధ్యక్షుడు పల్లాల వెంకటరమణారెడ్డి తదితరులు పలు చోట్ల తుప్పలు, డొంకలు నరికి పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమాల్లో అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, ఎస్ఐ రామకృష్ణ, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యం

చింతూరు: చింతూరులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్ మాట్లాడుతూ పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతిఒక్కరు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చైతన్య, ఎంపీపీ అమల, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.పుల్లయ్య, ఫారెస్ట్ రేంజి అధికారి అబ్దుల్ కలాం అజాద్, తహసీల్దార్ చిరంజీవి, ఈఓపీ ఆర్‌డీ గుంపెనపల్లి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ఎటపాక, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్ష నిర్వహణ కోసం విలీన మండలాల్లో నాలుగు కేంద్రాలను ఏర్పాటుచేశారు. చింతూరు ఏపీటీడబ్ల్యుఆర్ఎస్, చింతూరు జడ్పీఉన్నత పాఠశాల, కూనవరం జడ్పీఉన్నత పాఠశాలతోపాటు ఎటపాక సెయింట్‌ఆన్స్ పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటుచేశారు. విలీన మండలాల్లో మొత్తం 944 మంది విద్యార్థులు నవోదయ ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే పరీక్షకు కేవలం 620 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 324మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సెయింట్ ఆన్స్ పాఠశాలలో పరీక్ష నిర్వహణ తీరుని, ఏర్పాట్లను ఎంఈవో లక్ష్మీనారాయణ పరిశీలించారు.

నవోదయ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎస్పీ

వై.రామవరం: వై.రామవరం మండలం పి.యర్రగొండ గిరిజన సంక్షేమ ఏకలవ్య పాఠశాలలో శనివారం నిర్వహించిన జవహార్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షలను రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ తనిఖీ చేశారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

వరద బాధితులకు వితరణ

కూనవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గతంలో వచ్చిన వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు గుడ్‌లైఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వితరణ అందజేశారు. మండలంలోని కొండయ్యగూడెం గ్రామానికి చెందిన గిరిజనులకు ఈ పంపిణీ జరిగింది. సుమా రు 160 కుటుంబాలకు పంపిణీ చేసినట్లు మినిస్ట్రీస్ నిర్వాహకులు తెలిపారు. గత మూడేళ్లుగా ఈ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, కంటి పరీక్షలు అందించడం జరుగుతుంది. ఇళ్లు కోల్పోయిన వారికి సిమెంట్ రేకులు, చిన్న చిన్న దుకాణాలు, ఆ టో కొనుగోలుకు ఆర్థిక సాయం అందించారు. ఫౌం డర్ లుక్ జాన్సన్, ప్రభాకర్, ఎస్.ప్రేమ్‌సాగర్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన ఎన్టీఆర్

● టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి



జగ్గంపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే నెహ్రూ, బెండపూడిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం దివంగత నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి జగ్గంపేటలో నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియడారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, కొత్త కొండబాబు, పోతుల మోహన్‌రావు, చదరం చంటిబాబు, కన్నబాబు, భరత్‌బాబు, మంగ రౌతు రామకృష్ణ, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, కందుల చిట్టిబాబు, భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, యర్రంశెట్టి బాబ్జి, దాసరి సీతారామకృష్ణ, కంచుమర్తి రాఘవ, సుంకవిల్లి రాజు, దాపర్తి సీతారామయ్య, పాఠంశెట్టి మురళీకృష్ణ, కుంచే తాతాజీ, సర్పంచులు అడబాల అంజనేయులు, భూసాల విష్ణు, సర్వసిద్ది లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో కెఎమల్లవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, పెంటకోట భాస్కరసత్యనారాయణ, పెనుముచ్చు నాగేశ్వరరావు అంకంరెడ్డి రమేష్, షేక్‌నవాబ్‌జానీ, చిటికెల సత్యనారాయణ, పోతల సూరిబాబు, వెలగా వెంకటకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు మూది నారాయణస్వామి, సూతి బూరయ్య, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో స్థానిక దిబ్బలపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుమారు 110 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జె.అన్నవరంలో బొరుసు శ్రీనివాస్, నగర పంచాయతీ మాజీ వైస్‌చైర్మన్ పైల సత్యనారాయణ నేతృత్వంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పసల సూరిబాబు, కొప్పుల బాబ్జి, బస్వా ప్రసాద్, షైరాల కనకారావు, వాగు రాజేష్, బూర్లు సత్తిబాబు, బెల్లాని శ్రీను, బ్యాంకు రాజు, లలిత ఉన్నారు.

తెలుగుజాతి గర్వించదగ్గ మహానేత ఎన్టీఆర్

తొండంగి: తెలుగు జాతి గర్వించగ్గ మహానేత స్వర్గీయ ఎన్టీ రామారావు అని పలువురు వక్తలు పేర్కొన్నారు, శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. శృంగవృక్షంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కొయ్యా రామకేశవ, కొయ్యా సూరిబాబు, కోడ వెంకటరమణ, దూలం అప్పారావు, వీరబాబు పాల్గొన్నారు. బెండపూడిలో జరిగిన కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు, పాలచర్ల ఎర్రబ్బు, పాలచర్ల సుబ్బారావు, బూసాల శ్రీనివాసరావు, జి.రమేష్, కోరుకొండ శివ, సోమిశెట్టి నానాజీ పాల్గొన్నారు. ఏవీ నగరంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి యనమల నాగేశ్వర్రావు పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ యనమల కృష్ణ, కొయ్యా శ్రీనుబాబు, యనమల సత్యన్నారాయణ, పెదబాబు తదితరులు నివాళి అర్పించారు. ఏ కొత్తపల్లిలో వనపర్తి రాజా, వనపర్తి చిట్టిబాబు, సోము రమణ, కొంజర్ల గోవిందు తదితరులు నివాళి అర్పించారు

గండేపల్లి: ఎన్టీఆర్ 29వ వర్ధంతిని మండలంలో శనివారం నిర్వహించారు. మురారి గ్రామంలో టీడీపీ యువ నాయకులు, ఉపసర్పంచ్ జాస్తి వసంత్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నటునిగా, ప్రజానాయకునిగా, కోట్ల మంది ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు.



మురారిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న జాస్తి వసంత్

రౌతులపూడి: నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ అని మండల టీడీపీ అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. రౌతులపూడిలో మార్కెట్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద వర్ధంతి నిర్వహించారు. రాష్ట్రవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు వందమంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ యుగ పురుషుడు

ప్రత్తిపాడు: సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పని చేసిన యుగ పురుషుడు ఎన్టీఆర్ అని స్థానిక టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు,యాళ్ళ జగదీష్, వెలుగుల కొండలరావు, మండల టీడీపీ అధ్యక్షులు అమరాది వెంకట్రావులు కొనియాడారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తోటవీధిలోని పార్టీ కార్యాలయం వద్ద నిరుపేద మహిళలకు దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మూరా సత్యనారాయణ వరప్రసాద్, పంచాది వీరబాబు, పల్లాగోపి, అడ్డాల త్రిమూర్తులు, రావూరి తాతాజీ పాల్గొన్నారు.



ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంలో పేదలకు దోమతెరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



ఏలేశ్వరం: పెద్దనాపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



రౌతులపూడిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

● ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్

జగ్గంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రత మనందరి బాధ్యతని ప్రతి ఒక్కరు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడానికి తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట గ్రామపంచాయతీ కార్యదర్శి వత్సవాయి రాజన్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోను జగ్గంపేట మెయిన్‌రోడ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై పారిశుధ్య సిబ్బందితోను, అంగన్‌వాడీ, ఆశావర్కర్స్‌తోను వీధులను శుభ్రపరిచి ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పోతుల మోహన్‌రావు, పాండ్రంగి రాంబాబు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, సీడీపీవో పూర్ణిమ, డ్వాక్రా యానిమేటర్లు, గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

ఏలేశ్వరం: గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. శనివారం కూట మి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతీనెలా మూడో శనివారం ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంవద్ద ఎంపీడీవో సూర్యనారాయణ నేతృత్వంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొని కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ప్రతిజ్ఞ చేశారు. సూతి బూరయ్య, పసల సూరిబాబు, కొప్పుల బాబ్జి,బసా ప్రసాద్, నూకతాటి ఈశ్వరుడు, షైరాల కనకారావు, అధికారులు తదితరులు ఉన్నారు.

స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో ప్రతిజ్ఞ

కోటనందూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం మండల పరిషత్ కార్యలయంలో ఎంపీడీవో వెంకట నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలతో ప్రజలు బాగస్వాములై గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

కిర్లంపూడి: స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం శనివారం కిర్లంపూడి మండల పంచాయతీల్లో నిర్వహించారు. కిర్లంపూడిలో సర్పంచ్ శ్రీలత రాంబాబు, ఎంపీడీవో హరికృష్ణ, డాక్టర్ రాంబాబు నాయక్, సెక్రటరీ ఎన్‌టిఆర్ రమేష్ తదితర అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే బూరుగుపూడిలో సర్పంచ్ ఆశపు రామలక్ష్మి, ఉపసర్పంచ్ పాటంశెట్టి కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ పాటంశెట్టి రవి, కుంచే తాతాజీ, సిబ్బంది ఆధ్వర్యంలో ఈకార్యక్రమం చేపట్టారు. పరిసరాలను శుభ్రపరిచిప్రతిజ్ఞ చేశారు.

గండేపల్లి: గండేపల్లిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని శాఖలాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దార్ శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు పాల్గొన్నారు. గండేపల్లి పోలీస్ పరిసరాలను జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు శుభ్రపరిచి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ చేశారు.

పరిశుభ్రతను పాటించండి

శంఖవరం: ప్రజలంతా పరిశుభ్రతను పాటించాలని టీడీపీ నేత పర్వత సురేష్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలో అన్ని గ్రామాలలో ప్రధాన కూడళ్లను శుభ్రపరిచి, అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కత్తిపూడి, శంఖవరం, నెల్లిపూడి వంటి గ్రామాలలో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఉపసర్పంచ్ చింతమనీడి కుమార్, కత్తిపూడిలో జనసేన నేతలు సుబ్రహ్మణ్యం, సుభాష్ పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో..

అన్నవరం: రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సత్యగిరికొండపై చేపట్టిన కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈవో మాట్లాడుతూ ఇటువంటి ప్రభుత్వ కార్యక్రమాల రోజులలోనే కాకుండా ప్రతినిత్యం ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమ నోడల్ అధికారిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఏఈవోలు కృష్ణారావు, కొండలరావు, ఎల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

రౌతులపూడి: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం పొంద వచ్చునని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. మూడో శని వారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ప్రధాన రహదారిపై అల్లూరి సీతారామరాజు సెంటర్ వరకు స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంపీపీ గోళ్ళకాంతి సుధాకర్ ప్రారంభించగా ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్, తహసీల్దార్ సూర్యప్రభ, ఎంఈవో వి.రాజబాబు, ఏపీవో కుమార్‌స్వామి, ఏపీఎం వెంకట్ వివిధ శాఖల సిబ్బందిపాల్గొన్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో మానవహారం నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేశారు.

స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ ర్యాలీలు

తొండంగి: మండలంలోని గ్రామ పంచాయతీలలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని గ్రామ పంచాయ తీల్లో నిర్వహించారు. శనివారం బెండపూడి, తొండంగి, పెరుమాళ్ళపురం తదితర గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. బెండపూడిలో కార్యదర్శి మధుకుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.



అన్నవరంలో స్వచ్ఛదివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఈవో సుబ్బారావు



జగ్గంపేట: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



గండేపల్లిలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ ర్యాలీ, ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తాండవ రిజర్వాయర్ అభివృద్ధికి రూ.13.12కోట్లు

కోటనందూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ అభివృద్ధికి కూటమిప్రభుత్వం చర్యలు చేపడుతుందని టీడీపీ రాష్ట్ర ప్రదానకార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. శనివారం ప్రాజెక్టు వద్ద తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తాండవ రిజర్వాయర్‌కు పోలవరం కాలువ నీళ్ల మళ్లించేందుకు కృషి చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో తాండవకు మహర్దశ ఉంటుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ అభివృద్ధికి రూ 13.12కోట్లు కేటాయించారని చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. ఇప్పటికే కొన్ని పనులకు రూ.2.10 కోట్లుటెండర్లు పిలవడం జరిగిందన్నారు.

తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ పదిలం

తునిరూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):తెలుగు వారి గుండెల్లో దివంగత నందమూరి తారక రామారావు పదిలమని టీడీపీ యువ నాయకులు యనమల రాజేష్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి పురస్కరించుకుని తేటగుంట టీడీపీ కార్యాలయలో ఎన్టీఆర్‌కి కార్యకర్తలతో కలిసి ఘన నివాళులర్పించారు. ఎన్. సూరవరం గ్రామం లో పార్టీ సీనియర్ కార్యకర్త చింతమనీడి నాగ సోమరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తుని పట్టణంలో తుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో మాజీ కౌన్సెలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్‌జైలును పరిశీలించిన ఆర్డీవో

ప్రత్తిపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సబ్ జైలును పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, జడ్జి కాటంభానులతో బృందం శనివారం సందర్శించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సబ్ జైలులో రిమాండ్ ఖైదీలను కులం పేరుతో పిలిచిన సందర్భాలపై పరిశీలన నిర్వహించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, సీఐ బి. సూర్యఅప్పారావు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య, ఎస్ఐ ఎస్. లక్ష్మికాంతం తదితరులు ఉన్నారు. అనంతరం ఆర్డీవో స్థానిక వైద్యా విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆక్సిజన్ ప్లాంట్, ఎక్సరే ప్లాంట్‌లను కూడా పరిశీలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య, వైద్యులను ఆసుపత్రి పనితీరుపై సమీక్షించారు.

క్రీడలతోనే ఆరోగ్యం

చింతూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే ఆరోగ్యం సొంతమవుతుందని జేకే సీటీ ట్రస్ట్ చైర్మన్, ఆయుర్వేద నిపుణుడు జమాల్‌ఖాన్ అన్నారు. శనివారం చింతూరులో జేకేసీటీ నేతృత్వంలో వాలీబాల్, ఆర్చరీ పోటీలను జమాల్‌ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడారు. మన్యంలో యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం వెలికి తీసే దిశగా జేకే సీటీ ట్రస్ట్ చొరవ తీసుకుంటుందన్నారు. ట్రస్ట్ సభ్యులు రియాజ్, షాజహాన్, విక్కీ, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.